సాక్షి
కర్నూలు
బుధవారం । 6 । నవంబర్ । 2024



రూ.2 లక్షల విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నదాన పథకానికి కర్ణాటక రాష్ట్రం కొప్పల్‌కు చెందిన సింధు నాగరల్లి రూ. లక్ష, ప్రాణదాన ట్రస్ట్‌కు విజయవాడకు చెందిన వెంకట రామకృష్ణ రూ. లక్ష విరాళాన్ని అందించారు



మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై మంగళవారం హైదరాబాద్‌కు చెందిన కార్తికేయ డ్యాన్స్ స్కూల్ వారి నృత్య ప్రదర్శన అలరించింది. పాములపాడుకు చెందిన నందీశ్వర బృందం భజన ఆకట్టుకుంది.




టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,632
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:13,325
అవుట్ ఫ్లో	:12,905

సాఫ్ట్‌గా దోచేస్తున్నారు!

- కొందరు అడ్డదారిలో ఉద్యోగ ప్రయత్నం
- నిరుద్యోగులను నిలువునా దోచుకుంటున్న మోసగాళ్లు
- ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ. లక్షల వసూళ్లు
- ఆన్‌లైన్ వేదికగా మోసాలు
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బాధితులు

పోటీ ప్రపంచంలో కష్టపడి ఉన్నత చదువులు పూర్తి చేసినా కూడా మంచి ఉద్యోగాలు దొరకడం కష్టమవుతోంది. దీనికితోడు చదివిన చదువుకు చేసే ఉద్యోగానికి పొంతనలేని పరిస్థితి నెలకొనడంతో యువతలో అయోమయం, ఆందోళన నెలకుంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో మంచి కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగమంటూ, నిరుద్యోగుల ఆశలను ఆసరాగా చేసుకుని నిలువునా మోసం చేస్తున్నాయి కొన్ని కన్సల్టెన్సీలు, మోసగాళ్లు. ఉద్యోగం ఇప్పిస్తామని బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు తీసుకెళ్లి మోసగిస్తున్నారు. నిరుద్యోగ సమస్యను అధిగమించడంతో పాటు కుటుంబానికి అండగా నిలవాలనే ఆశతో ఇలాంటి వాటికి ఆకర్షితులై చివరకు డబ్బులు పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు.



కర్నూలు(హాస్పిటల్): ఇటీవల కాలంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో మోసానికి గురవుతున్న నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోంది. 'మోసపోయాం.. న్యాయం చేయండి' అంటూ అధికారులు, పోలీసు స్టేషన్ల చుట్టూ బాధితులు తిరుగుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 85 డిగ్రీ కాలేజీలు, 8 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి సంవత్సరం 18 వేల మంది దాకా విద్యార్థులు డిగ్రీ పట్టాలు చేత బట్టుకుని బయటకు వస్తున్నారు. ఇలా బయటకు వచ్చిన వారు వెంటనే ఉద్యోగంలో చేరాలన్న ఆత్రుతతో ఎలాంటి స్కిల్స్ లేకపోయినా వారు.. వీరు.. చెప్పిన మాటలు నమ్మి మోసపోతున్నారు. కొందరు మోసగాళ్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిస్తామంటూ యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో ప్రకటనలతో హోరెత్తిస్తున్నారు. నిరుద్యోగులకు నైపుణ్యాలు లేకపోయినా సరే తాము నేర్పిస్తామని, మూడు నెలల్లో అద్భుతమైన ఉద్యోగం కల్పిస్తామని నమ్మబలుకుతున్నారు. ఈ మేరకు పలు కన్సల్టెన్సీ ఏజెన్సీలు నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసిన ఏజెన్సీలు కూడా ఉన్నాయి. తీరా అక్కడ చేరాక మీలో నైపుణ్యాలు కంపెనీకి సరిపడా లేవని, కంపెనీ నుంచి ఆర్డర్ వస్తే చెబుతామంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పి వెనక్కి పంపించేస్తున్నారు. ఇలాంటి సంస్థలు ఎక్కువగా హైదరాబాద్, బెంగళూరు కేంద్రంగా పనిచేస్తూ నిరుద్యోగులను బురిడీకొట్టిస్తున్నాయి. ఇందులో కొన్ని ట్రైనింగ్ కన్సల్టెన్సీ పేరుతో ట్రైనింగ్ ఫీజు కట్టించుకుంటున్నారు. శిక్షణ, ప్లేస్‌మెంట్ తర్వాత మార్కెట్ స్లోగా ఉందని ఉద్యోగులను వెనక్కి పంపించేస్తున్నారు. మరికొన్ని సంస్థలు నిరుద్యోగులు ఇచ్చే ప్యాకేజీని బట్టి నెలకు రూ.30 వేలతో ఉద్యోగం అంటూ చేర్చుకుని మొదటి నెల రూ.30 వేలు ఇస్తారు. ఆ తర్వాత ప్రాజెక్టు ఆగిపోయిందని, స్టార్ట్ అయ్యాక మళ్లీ పిలుస్తామని చెప్పి పంపించేస్తున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని మోసాలు



- ఇటీవల కాలంలో నంద్యాలలో గిగ్‌లీజ్ అనే సంస్థ నిరుద్యోగులకు రూ.1.20 కోట్లతో టోపీ పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇలా 170 మందిని తీసుకోగా అందులో 50 మంది నంద్యాలకు చెందిన వారే ఉండటం గమనార్హం.
- కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీకి చెందిన అక్బర్ హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఓ కంపెనీలో ఫ్రంట్ ఎండ్ డెవలపర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఇందుకోసం ఆ సంస్థ అతని వద్ద రూ.1.80 లక్షలు కట్టించుకుంది. జీతం రూ.20 వేలని, వర్క్‌ఫ్రమ్ హోమ్ ఉద్యోగమని నమ్మబలికారు. 3 నెలల తర్వాత జీతం ఇవ్వలేదు. ఇదిగో అదిగో అంటూ తిప్పుకుంటున్నారు. వారి సంస్థలో పని చేసినట్లు ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ కూడా ఇవ్వలేదు.
- బనగానపల్లెకి చెందిన మునిశేఖర్ యూట్యూబ్‌లో వచ్చిన ప్రకటనలకు ఆకర్షితుడై హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ముందుగా రూ.1.50 లక్షలు చెల్లించి ఉద్యోగంలో చేరాడు. ఇందుకోసం అతనికి కంపెనీ 3 నెలల పాటు శిక్షణ ఇచ్చింది. శిక్షణా కాలంలో అతనికి రూ.10 వేల చొప్పున ఇచ్చారు. ఆ తర్వాత ఒక నెల ఉద్యోగం చేయించుకుని జీతం కూడా ఇవ్వకుండా కంపెనీకి పనికొచ్చే నైపుణ్యాలు నీ వద్ద లేవంటూ వెనక్కి పంపించేశారు.
- హైదరాబాద్‌కు చెందిన ఏవోఎల్ అండ్ డెకావర్స్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ కర్నూలులో బ్రాంచ్‌ను ఓపెన్ చేసి ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు వలవేసింది. రూ.5 లక్షలు ఇస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగమంటూ నమ్మ బలికింది. దీంతో కర్నూలుకు చెందిన అనూషతో పాటు మరో 18 మంది రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.95 లక్షలు వారికి ఇచ్చారు. మొదట ఆన్‌లైన్ శిక్షణ పేరుతో కొన్నాళ్ల కాలం గడిపారు. తర్వాత కంపెనీ ప్రతినిధులు ఉద్యోగులను పట్టించుకోకపోవడంతో ఇటీవల వారు స్థానిక నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- కర్నూలు నగరంలోని హోసన్నా మందిరం వద్ద ఉన్న శ్రేయాస్ అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశాడని కల్లూరు మండలం ఉద్యోగనగర్‌కు చెందిన ప్రకాష్ రాజ్ గత సోమవారం జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- ఇంజినీరింగ్ 3వ సంవత్సరం నుంచి జాబ్‌కు కావాల్సిన ప్రత్యేక స్కిల్స్ నేర్చుకుని ప్లేస్‌మెంట్స్‌కు సన్నద్ధం కావాలి.
- చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టు వర్క్ ఆన్‌లైన్‌లో గాకుండా ఆఫ్‌లైన్ ద్వారా చేయడం మంచిది.
- కేవలం టెక్నికల్ స్కిల్స్‌కే పరిమితం గాకుండా ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌లో భాగంగా ఆప్టిట్యూట్, రీజనింగ్, ఆటిట్యూట్ (సాఫ్ట్‌స్కిల్స్)లో శిక్షణ తీసుకోవడం మంచిది.
- క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో వచ్చిన ఉద్యోగ అవకాశాన్ని కేవలం జీతం అనే ఉద్దేశంతో వదులుకోవద్దు. కొంత మంది ఉద్యోగంలో చేరిన వెంటనే ఎక్కువ జీతానికి ఆశపడుతున్నారు. ఇలాంటి వారినే మోసగాళ్లు ఎంచుకుంటున్నారు.
- డిగ్రీ పూర్తయిన వెంటనే మీ రెజ్యూమ్‌ను ఆన్‌లైన్ పోర్టల్స్ నౌకరి డాట్‌కామ్, linkdinలో అప్‌లోడ్ చేయాలి.
- నాన్ ఐటీ బ్రాంచెస్ వారు (మెకానిక్, సివిల్) త్వరగా ఉద్యోగం వస్తుందన్న ఆశతో ఐటి సైడ్ పరుగెత్తకుండా మీ కోర్ బ్రాంచెస్‌లో లభిస్తున్న అవకాశాలన్నీ చూసుకోవాలి.



- ఇటీవల కాలంలో వస్తున్న యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్ పబ్లిసిటీల్లో చెబుతున్న ప్రకటనలకు తొందరపడి ఆకర్షితులు కావద్దు. ఏ బ్రాంచ్ వారైనా సరే త్వరగా ఉద్యోగం సంపాదించాలంటే ఐటీ శిక్షణ తీసుకోవాలి.
- కాలేజ్ యాజమాన్యం ఏ బ్రాంచ్ వారికి ఆ బ్రాంచ్‌లో కల ఉద్యోగ అవకాశాలను క్యాంపస్‌లోనే తెలిపితే బాగుంటుంది.

థర్డ్‌పార్టీని నమ్మి డబ్బులు మోసపోవద్దు



సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగాలలో రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఏదైనా సరే నోటిఫికేషన్ ద్వారానే భర్తీ అవుతాయి. ఎవ్వరైనా మాకు వారు తెలుసు, వీరు తెలుసని మాయమాటలు చెప్పి డబ్బులు అడిగితే ఇవ్వకూడదు. అలాగే ప్రైవేటు రంగంలోనూ కంపెనీలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తాయి. మా ద్వారా కూడా జాబ్ మేళాలు నిర్వహించి ఆయా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటాం. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, క్రెడిబిలిటీ లేని వెబ్‌సైట్స్ చూసి మోసపోవద్దు. ఏవైనా సందేహాలు ఉన్నా, ఉద్యోగాలకు ఆఫర్లు వస్తే అనుమానాన్ని నివృత్తి చేసుకోవడానికి జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం, సెట్కూరు కార్యాలయంలో కలిసి సందేహాలను నివృత్తి చేసుకోవాలి. మధ్య దళారులను నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దు.

– పి. దీప్తి, జిల్లా యువజన సంక్షేమాధికారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి, కర్నూలు

కంపెనీలు డబ్బులు అడగవు



కంపెనీలు ఎప్పుడూ ముందుగా డబ్బులు అడగవనేది నిరుద్యోగులు బాగా గుర్తుపెట్టుకోవాలి. అలా అడిగారంటే అవి కన్సల్టెన్సీ సర్వీసెస్. మీ డబ్బులు తీసుకుని మూడు నెలల తర్వాత ప్రాజెక్టు రాలేదని లేదా మీ నైపుణ్యాలు కంపెనీకి సరిపోవని మిమ్మల్ని తీసేస్తారు. అలాగని వారు ముందుగానే అగ్రిమెంట్ కాగితంపై సంతకాలు చేయించుకుంటారు. దీనివల్ల వారిపై ఎక్కడా కేసు కూడా పెట్టలేని పరిస్థితి. మేము కొన్నేళ్లుగా నిరుద్యోగులకు మా సంస్థ ద్వారా కెరీర్ కౌన్సిలింగ్ శిక్షణ ఇస్తున్నాం. కొన్నేళ్లుగా మా సంస్థ వెబ్‌సైట్ ద్వారా నిరుద్యోగులకు ఉచితంగా ఉద్యోగ అవకాశాల వివరాలను అందిస్తున్నాం.

– ఎస్.రాజశేఖర్, కెరీర్ కౌన్సిలర్, కర్నూలు

న్యూస్‌రీల్

టమాట, నూనె గింజల ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

ఎమ్మిగనూరురూరల్: బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో టమాట, నూనె గింజల ఆధారిత ఉత్పత్తులపై ఉమ్మడి కర్నూలు జిల్లాలకు చెందిన వారికి ఆరు రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. కె. రాఘవేంద్ర చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆసక్తి ఉన్న వారికి చిరుధాన్యాలు, అపరాలు, నూనె గింజలు, టమాటలో విలువ ఆధారిత ఉత్పత్తులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులు 18–45 సంవత్సరాల లోపు వారై, చదవటం, రాయడం వచ్చి ఉండాలి, ఆరు రోజుల శిక్షణలో ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 11వ తేదీ లోపు కేవీకేలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9346045968 ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

దీపం పథకానికి ఈకేవైసీ చేయించుకోవాల్సిందే

కర్నూలు(సెంట్రల్): దీపం–2 పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం రేషన్ కార్డు కలిగిన వినియోగదారులు వారి గ్యాస్ కనెక్షన్ ఈకేవైసీని సంబంధిత ఏజెన్సీల దగ్గర చేయించుకోవాలని డీఎస్ఓ రాజారఘువీర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేయించుకున్న వినియోగదారులు మొదటి సిలిండర్‌ను పొందడానికి మార్చి – 2025 వరకు అవకాశం ఉందని చెప్పారు.

ఉల్లి ధరల్లో పురోగతి



కర్నూలు(అగ్రికల్చర్): దేశవ్యాప్తంగా ఉల్లికి డిమాండ్ ఉండటంతో కర్నూలు మార్కెట్‌లో కూడా ధరల్లో రోజురోజుకు పురోగతి ఉంటోంది. ఉల్లి ధరలను మహారాష్ట్రలోని దిగుబడులు ప్రభావితం చేస్తాయి. మహారాష్ట్రలో దిగుబడులు ఎక్కువగా ఉంటే ఇక్కడ ధరలు తగ్గుతాయి. అక్కడ దిగుబడులు పడిపోతే ఇక్కడ పండించిన ఉల్లికి డిమాండ్ వస్తుంది. ప్రస్తుతం మహారాష్ట్రలో ఉల్లి దిగుబడులు తక్కువగా ఉండటంతో కర్నూలు ఉల్లికి డిమాండ్ ఏర్పడింది. ఇక్కడ పండించిన ఉల్లి ప్రధానంగా పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాలకు తరలుతోంది. అక్కడి నుంచి విదేశాలకు కూడా ఎగుమతి అవుతోంది. సోమవారం కర్నూలు మార్కెట్‌లో గరిష్ట ధర రూ.4,439 లభించింది. మంగళవారం కనిష్ట ధర రూ.644, గరిష్ట ధర రూ.4,669 లభించింది. సగటు ధర కూడా ఆశాజనకంగా నమోదైంది. సగటు ధర రూ.3,898 నమోదైంది. సగటు ధరను పరిశీలిస్తే రైతులకు లభిస్తున్న ధరలు మెరుగ్గానే ఉన్నట్లు స్పష్టమవుతోంది. కాగా మార్కెట్‌కు ఉల్లి తాకిడి మరింత తగ్గింది. ఉల్లి రావడం సాధారణ స్థితికి చేరినట్లు స్పష్టమవుతోంది. 314 మంది రైతులు 6,879 క్వింటాళ్ల దిగుబడిని మాత్రమే మార్కెట్‌కు తెచ్చారు.

రోగుల సహాయకులకు విజిటింగ్ పాస్‌లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో త్వరలో రోగుల సహాయకులకు విజిటింగ్ పాస్‌లు జారీ చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయనను కలిసిన ప్రజాసంఘాల నాయకులతో మాట్లాడుతూ ఒక రోగితో నలుగురైదుగురు సహాయకులు రావడం వల్ల ఆసుపత్రిలో రద్దీ అధికమైందన్నారు. ఇలా వచ్చిన వారు ఆసుపత్రి ఆవరణలో ఉండి చెత్తాచెదారాన్ని అక్కడే వేస్తున్నారు. దీనివల్ల ఆసుపత్రి పరిశుభ్రత దెబ్బతింటోందని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డుల్లో ఎక్కువ మంది ఇతరులు తిరగడం వల్ల రోగులకు ఇన్‌ఫెక్షన్ ఎక్కువై వారు కోలుకునేందుకు ఆలస్యం అవుతుందని, కొన్నిసార్లు ప్రాణాంతకం అవుతుందని అభిప్రాయపడ్డారు. దీనిని నివారించేందుకు విజిటింగ్ పాస్‌లు జారీ చేయడమొక్కటే పరిష్కారమార్గమన్నారు.

దూరవిద్య పరీక్ష కేంద్రం రద్దు

కర్నూలు సిటీ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్య పరీక్షల్లో జిల్లాలోని గూడూరు శ్రీ శ్రీనివాస జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రంలో వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహించడంతో ఆ కేంద్రాన్ని రద్దు చేశారు. ఈ కేంద్రంలోని పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా కర్నూలు నగరంలోని ఎస్ఎల్ఎస్ కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పరీక్షలు రాసేలా మార్పు చేసినట్లు వర్సిటీ దూర విద్య కో–ఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. ఈ మేరకు హాల్ టికెట్లను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆయన ఓ ప్రకటన జారీ చేశారు.

పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక చొరవ

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



ఏపీఐఐసీ భూముల ఫీల్డ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఓర్వకల్లు: పారిశ్రామిక అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఓర్వకల్లు ప్రాంతంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములపై తహసీల్దార్ విద్యాసాగర్‌ను ఆరా తీశారు. ఏపీఐఐసీకి కేటాయించిన భూములకు సంబంధించిన ఫీల్డు మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం ఏపీఐఐసీ, జైరాజ్ స్టీల్ ప్లాంట్ పురోగతిపై అధికారులతో ఆయన సమీక్షించారు. అలాగే మెగా ఇండస్ట్రీయల్ హబ్‌కు సంబంధించి ఏపీఐఐసీ భూముల్లో జరుగుతున్న మౌలిక వసతుల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు నీటిని సరఫరా చేస్తున్న పైపులైన్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పైపులైన్ పనులు 50 శాతం పూర్తయినట్లు సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పారిశ్రామిక వాడ భూముల్లో జరుగుతున్న అంతర్గత రోడ్ల పనులను పరిశీలించి, వచ్చే మూడు నెలల్లోపు పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు శాతంపై ఆరా తీశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను గడువులోగా పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే కొత్తగా ఓటరు నమోదుకు ఏమైన దరఖాస్తులు వచ్చాయా? అధికారులను ఆరాతీశారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ కళ్యాణి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, పరిశ్రమల శాఖ ఇన్‌చార్జ్ జీఎం అరుణ, తహసీల్దార్ విద్యాసాగర్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు స్వల్పంగా పెరిగిన వరద

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం కొనసాగుతుంది. మంగళవారం సుంకేసుల బ్యారేజీకి నీటి ప్రవాహం స్వల్పంగా పెరిగింది. సోమవారం సాయంత్రం 7,850 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా మంగళవారానికి 11,510 క్యూసెక్కులకు పెరిగింది. ఇందులో నుంచి 8,892 క్యూసెక్కుల నీటిని బ్యారేజీ రెండు గేట్లు పైకెత్తి నీటిని దిగువకు, 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు విడుదల చేస్తున్నారు.

శ్రీరంగనాథుడికి రూ. 10.62 లక్షల ఆదాయం



హుండీ లెక్కిస్తున్న ప్రజలు, సిబ్బంది

మద్దికెర: పెరవలిలోని శ్రీరంగనాథ స్వామికి హుండీ ద్వారా రూ. 10.62 లక్షల ఆదాయం లభించింది. మంగళవారం ఆలయ పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 7 నెలల 8 రోజుల కాలానికి చేపట్టిన శాశ్వత హుండీ ద్వారా రూ. 10,62,160 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు రంగస్వామి, సిబ్బంది రఘు గ్రామ ప్రజలు సేవాసమితి వారు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల అక్రమ కేసులో అరెస్ట్ అయి జైల్‌కు వెళ్లిన పార్టీ సోషల్ మీడియా నంద్యాల జిల్లా కో–కన్వీనర్ తిరుమల కృష్ణను రాంభూపాల్‌రెడ్డి మంగళవారం కర్నూలు జైల్‌లో పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం రాంభూపాల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అసమర్థతను ఎత్తిచూపుతున్నారన్న అక్కసుతో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం తగదన్నారు. తిరుమల కృష్ణ దివ్యాంగుడు అని కూడా చూడకుండా అరెస్టు చేయడం దారుణమన్నారు. అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వైఎస్సార్‌సీ పీ సోషల్ మీడియా సభ్యులను భయభ్రాంతులకు గురిచేసినంత మాత్రాన ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు తెలియకుండా ఉండవన్నారు. అమ్మాయిలు, చిన్నపిల్లలపై అత్యాచారం, రౌడీయిజం చేసేవారిపై పోలీసులు తమ పవర్ చూపాలని హితవు పలికారు. టీడీపీ నాయకుల మెప్పు కోసం అమాయకులను అరెస్టు చేస్తున్నారన్నారు. తాను 1985 నుంచి ఎమ్మెల్యేగా ఉన్నానని, ఇప్పటి వరకు ఇంత చెత్త పరిపాలన చూడలేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదనే స్థాయికి పాలన వచ్చిందన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని కోరారు. ఆయన వెంట కార్పొరేటర్లు నారాయణరెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, అశోక్‌వర్ధన్ రెడ్డి, రమణారెడ్డి, హనుమంత్‌రెడ్డి, మహేష్ ఉన్నారు.



జైల్ నుంచి బయటకు వస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కూటమి నేతలకు చేదు అనుభవం

- యురేనియంపై అపోహలు తొలగిస్తామని టీడీపీ నేతల సభ నిర్వహణ
- కల్లబొల్లి మాటలొద్దు అంటూ చుట్టుముట్టిన ప్రజలు
- కలెక్టర్ లిఖితపూర్వకంగా రాసివ్వాలని పట్టు



కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డిని నిలదీస్తున్న గ్రామ మహిళలు

దేవనకొండ: యురేనియం భయంతో దాదాపు పది రోజులుగా ఆందోళన చేస్తున్న కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్ సమీప గ్రామాల ప్రజల నుంచి కూటమి నేతలకు చేదు అనుభవం ఎదురైంది. కప్పట్రాళ్ల ఫారెస్టులో యురేనియం తవ్వకాలను ఆపివేయాలంటూ కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టు చుట్టుపక్కల గ్రామాలైన కప్పట్రాళ్ల, పి.కోటకొండ, జిల్లెడు బుడకల, కె. వెంకటాపురం, గుండ్లకొండ, గుడిమిరాళ్ల, బేతపల్లి, బండపల్లి, మాచాపురం, దుబ్బనకుర్తి, ఈదులదేవరబండ, చెల్లెలచెలిమల తదితర గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగుతున్నారు. యురేనియంపై ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగిస్తామంటూ మంగళవారం కొండపై చెన్నకేశవస్వామి ఆలయంలో కూటమి నాయకులు టీడీపీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఆలూరు జనసేన ఇన్‌చార్జి వెంకప్ప, టీడీపీ సీనియర్ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి తదితర కూటమి నాయకులు సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఎలాంటి యురేనియం తవ్వకాలు జరపబోమని, వైఎస్సార్‌సీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతున్నారన్నారు. ఆయన ప్రసంగానికి ఒక్కసారిగా మహిళలందరూ అడ్డుపడి.. 'మీరు మాకు కల్లిబొల్లి కబుర్లు చెపొద్దు.. ఇక్కడ యురేనియం ఎట్టి పరిస్థితుల్లో తవ్వనీయం.. కలెక్టర్ లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చేంత వరకు పోరాటం ఆపేది లేదు' అని తేల్చి చెప్పారు. ప్రజలు రోజూ పనులు మానుకుని ధర్నా చేస్తున్నా జిల్లా కలెక్టర్ ఎందుకు రావడం లేదని ప్రజలు ప్రశ్నించారు. చివరకు కూటమి నేతలు చేసేదేమి లేక రెండు, మూడు రోజుల్లో కలెక్టర్ ఇక్కడికి వస్తారని చెప్పి వెనుదిరిగారు.

మీ మాటలు మేము నమ్మం



ఒకప్పుడు ఫ్యాక్షన్ వల్ల ఆస్తిని, మా కుటుంబాలను కోల్పోయాం. ఇక్కడే కొండపైన తినో తినకా పైసా పైసా కూడబెట్టుకుని పొలాల్లో బోర్లు వేసుకుని ప్రశాంతంగా జీవిస్తున్నాం. ఇక్కడ యురేనియం ఉందని గత పది రోజులుగా నిద్ర లేకుండా బతుకుతున్నాం. మాకు అధికారుల నుంచి రాతపూర్వకంగా రాయిస్తేనే ఉద్యమాన్ని విరమిస్తాం.

– లక్ష్మమ్మ, మాదాపురం గ్రామం

ఏది నమ్మాలి



ఇక్కడ యురేనియం లేదు. అపోహ పడుతున్నా మని మీరే చెబుతున్నారు. గతంలో వేసిన బోర్లు యురేనియం టెస్టింగ్ కోసమేనని మీరే చెబుతున్నారు. ఏది నిజం. మాకు రాతపూర్వకంగా జిల్లా కలెక్టర్ ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లో యురేనియం తవ్వకాలు జరపమని రాసి ఇవ్వాలి. లేకుంటే మేము ఎవరి మాట వినము.

– శ్రీనివాసులు, గుడిమిరాళ్ల గ్రామం

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): ఎంపీడీఓలు తమ పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కార్యక్రమాలను చేపడితే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా పరిషత్ సీఈఓ, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ జీ నాసరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీడీఓ, ఈఓఆర్డీలకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక (2025–26)పై శిక్షణ కార్యాక్రమాలు ప్రారంభమయ్యాయి. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ శిక్షణకు వైస్ ప్రిన్సిపాల్, డీపీఓ జీ భాస్కర్, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ డా.శ్రీనివాస్, నంద్యాల ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ మనోహర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ ఎస్ మంజులావాణి, డీటీఎం గిడ్డేష్, రాజవర్ధన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించిన నిధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జీపీడీపీ అమల్లో భాగంగా ప్రాధాన్యత ఉన్న పనులను ముందుగా ఎంపిక చేసుకొని వాటిని పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రణాళికాబద్ధంగా నిధులను వెచ్చించాలని, చేసే ప్రతి అభివృద్ధి పనికి రికార్డులు తప్పక నిర్వహించాలన్నారు. నోట్ ఫైల్, రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్, డీపీఓ జీ భాస్కర్ మాట్లాడుతూ జీపీడీపీ యాక్షన్ ప్లాన్ రూపకల్పనలో ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులందరు పాలుపంచుకోవాలన్నారు. గ్రామ సభల్లో లైన్ డిపార్టుమెంట్స్‌కు చెందిన అధికారులందరు పాల్గొనాలన్నారు. నంద్యాల డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 15 లక్ష్యాలను సాధించడంలో అన్ని విభాగాలకు సరైన నిష్పత్తిలో ప్రణాళికలను చేర్చుకోవాలన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జీ నాసరరెడ్డి

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్

కర్నూలు (టౌన్): శ్రీకాకుళంలో ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ -19 ఉషూ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో జయకుమారి, ఆశ్విత, శిరీషా (బంగారు పతకాలు), శివలక్ష్మీ, మధు మేఘన, పుష్పావతి, గౌరమ్మ, కీర్తన (వెండి పతకాలు)లను సాధించారు. వారిని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్ ఉషూ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు 8 పతకాలు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ



క్రీడాకారుడు దూద్‌వలీని అభినందిస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్

కర్నూలు (టౌన్): గుంటూరు జిల్లా తెనాలిలో ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన అండర్-17 బాలుర వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దూద్‌వలీ 102 కిలోల విభాగంలో వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా అతన్ని మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్‌పాల్ తన చాంబర్‌లో అభినందించారు. డీఈఓ మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటుతూ పతకాలు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు.

తల్లిని వదిలించుకున్న బిడ్డలపై కేసు

పత్తికొండ(తుగ్గలి): తల్లిని వదిలించుకున్న బిడ్డలపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పత్తికొండ పోలీసులు తెలిపారు. మూడు రోజుల క్రితం గుంతకల్లుకు చెందిన లింగుట్ల శ్రీనివాసులు తల్లి తిరుపతమ్మను పట్టణంలోని ఓ కాలనీలో రోడ్డుపై వదిలి వెళ్లాడు. ఈ ఘటనకు సంబంధించి ఆమె కుమారుడు, కూతుళ్లను పిలిపించి పోలీసులు మాట్లాడారు. తల్లిని తీసుకెళ్లేందుకు వారు ససేమిరా అనడంతో సీనియర్ సిటిజన్ యాక్టు కింద తిరుపతమ్మ కుమారుడు శ్రీనివాసులు, కోడలు, ఇద్దరు కూతుళ్లు, అల్లుళ్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం

గడివేముల: మండల కేంద్రానికి చెందిన ఓ మైనర్ బాలిక అస్పియ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బాలిక అస్పియ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లి తిరిగిరాకపోవడంతో తండ్రి జైనద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

అధికారుల కళ్లు గప్పి నిందితుల పరార్

- ఒకరి పట్టివేత, మరొకరి కోసం గాలింపు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు కోర్టు భవన సముదాయం ఆవరణ నుంచి ఇద్దరు నిందితులు పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వన్యప్రాణి వధకు కేసులో పట్టుబడిన వేముల ప్రసాదు, తమ్మిశెట్టి సుధా కర్‌ను వెలుగోడు రేంజ్ అటవీ అధికారులు పది రోజుల కిందట ఆత్మకూరు జూనియర్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరిచేందుకు తీసుకెళ్లారు. కోర్టు ఆవరణలో వేచి ఉన్న సమయంలో అధికారుల కళ్లుగప్పి నిందితులు తప్పించుకుని పారిపోయారు. ఖంగుతిన్న అటవీ అధికారులు గాలింపు చేపట్టగా తమ్మిశెట్టి సుధాకర్ పట్టుబడడంతో రిమాండ్‌కు పంపారు. మరో నిందితుడు వేముల ప్రసాదు కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. నిందిత ఎలు సిద్దాపురం గ్రామస్తులని, పాములపాడు మండలం భానుముక్కల సమీపంలో కొండగొర్రె (చౌసింగా) మాంసం విక్రయిస్తూ పట్టుబడినట్లు వెలుగోడు ఫారెస్ట్ రేంజర్ ఖాన్ తెలిపారు.

‘ప్రశస్త్’మైన భవితకు బాట

- విద్యార్థుల్లో లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్
- 21 లోపాలు గుర్తించే వీలు
- రెండు విభాగాలుగా యాప్ విభజన
- మొదటి దశలో గుర్తింపు.. రెండో దశలో నిర్ధారణ
- అనంతరం వైద్యానికి సిఫారసు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో పలువురికి శారీరక, మానసిక సమస్యలుంటాయి. కొందరు గుర్తించలేని లోపాలు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఇటువంటి వారిని గుర్తించడానికి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో ప్రశస్త్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఉపాధ్యాయులే విద్యార్థులను పరిశీలించి వారిలోని లోపాలను ఈ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది.



ప్రశస్త్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు చేయాల్సిందిదీ

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రశస్త్ యాప్‌ను డోన్‌లోడ్ చేసుకుని పేరు, ట్రెజరీ ఐడీ, మెయిల్ ఐడీ, సెల్ నంబరు, యూడైస్ కోడ్‌తో లాగిన్ అవ్వాల్సి ఉంది. అనంతరం యాప్‌లో సూచించిన విధంగా వివరాలు నమోదు చేయాలి.

21 రకాల లోపాల గుర్తింపునకు అవకాశం

వైకల్యం ఉన్న పిల్లలను ధ్రువీకరించడం, స్క్రీనింగ్‌లో ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని మెరుగుపర్చడం, ఆశాస్త్రీయ నిర్ధారణ, లేబులింగ్ నుంచి రక్షణ, పిల్లల పరిస్థితి గురించి స్పష్టతను సులభతరం చేయడం, వైకల్యం ఉన్న విద్యార్థులకు సమగ్ర విద్యను అందించడం దీని ముఖ్య ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల సామర్థ్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల్లో చదవడం, వినడం, మాట్లాడడంతో పాటు చెప్పిన పదాన్ని పదే పదే చెప్పడం, రోజువారీ పనులు సొంతంగా చేసుకోలేకపోవడం, అనుమతి లేకుండా తరగతి నుంచి వెళ్లడం, నెమ్మదిగా చదవడం, రాయడం, స్పష్టత లేని చేతి రాత, రివర్స్ రాయడం, గణిత చిహ్నాలు అర్థం చేసుకోలేకపోవడంలో ఇబ్బంది పడడం, పునరావృత ప్రదర్శనలో ఇబ్బందులు, ఆసక్తి లేకపోవడం, చెప్పిందే చెబుతూ ప్రతి స్పందించడం, విచారంగా కనిపించడం, త్వరగా అలసిపోవడం తదితర 21 రకాల లోపాల్లో దేనితో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారో ఉపాధ్యాయులు ప్రత్యక్షంగా పరిశీలించి నమోదు చేస్తారు.

ప్రశస్త్ లోగో

రెండు విభాగాలుగా నమోదు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వివరాలను నమోదు చేసే ప్రశస్త్ యాప్‌ను రెండు భాగాలుగా విభజించారు. ఇందులో పొందుపర్చినట్టుగా ఉపాధ్యాయులు విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకోవాల్సి ఉంటుంది. మరికొన్నింటిని వారే విద్యార్థిని నిశితంగా పరిశీలించి నమోదు చేయాల్సి ఉంటుంది. యాప్‌లో 63 రకాల ప్రశ్నలకు సమాధానాలు పొందుపర్చాల్సి ఉంటుంది. పార్ట్-1లో లోపాలు గుర్తిస్తే, పార్ట్-2లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల లోపాలను ఉపాధ్యాయులు పరిశీలించి వైద్యులకు సిఫార్సు చేస్తారు.

సత్వర చర్యలు చేపట్టాం



ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థుల వివరాలన్నీ వంద శాతం నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు వివరాలు నమోదు చేసేలా ఆదేశాలు ఇచ్చాం. నమోదు వివరాలను ఉన్నతాధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారు.

– శ్రీనివాసులు, సహిత విద్య కో-ఆర్డినేటర్, నంద్యాల

స్క్రీనింగ్ ముఖ్యం



ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థులను స్క్రీనింగ్ చేయడం ముఖ్యమైన అంశం. అభ్యసనంలో విద్యార్థులకు ఉన్న ఇబ్బందులను గుర్తించి సవరించేందుకు ప్రశస్త్ ఉపకరిస్తుంది. ఉపాధ్యాయులందరూ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, విద్యార్థులందరినీ సాధ్యమైనంత తొందరగా స్క్రీనింగ్ చేసి వివరాలు నమోదు చేయాలి

– జనార్దన్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

‘టాప్’ లేపారు

పట్టుదల, అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే పేదరికం అడ్డురాదని నిరూపిస్తున్నారు నిరుపేద కుటుంబానికి చెందిన యువతీ యువకులు. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ తమను చదివిస్తున్నారని, వారి కష్టం వృథా కారాదని భావించి పట్టుదలతో లక్ష్య సాధన వైపు అడుగులు వేస్తున్నారు. సోమవారం విడుదలైన టెట్ ఫలితాల్లో 150కి 150 మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు.

- టెట్‌లో సత్తా చాటిన విద్యాకుసుమాలు

కొలిమిగుండ్ల: గొర్విమానుపల్లెకు చెందిన కొండయ్య, వరలక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు సంతానం. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. దంపతులు రోజూ నాపరాతి గనిలో కూలీ పనులకు వెళుతుంటారు. వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషించుకుంటూ అతి కష్టం మీద పిల్లలను చదివిస్తున్నారు. చిన్న కుమార్తె మంజుల అనంతపురం జిల్లా గుత్తి ఏపీఆర్‌జేసీ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుంది. పదిలో 9.3 గ్రేడ్ సాధించింది. బనవాసిలో ఇంటర్మీడియట్‌లో 977 మార్కులతో ప్రతిభ చాటుకుంది. తర్వాత ఓపెన్‌లో డిగ్రీ పూర్తి చేసుకుంది. అనంతపురంలో టీటీసీ పూర్తి చేసి అక్కడే టెట్‌కు కోచింగ్ తీసుకుంది. 2022లో నిర్వహించిన టెట్‌లో సైతం 150 మార్కులు సాధించింది. ఆ సమయంలో డీఎస్సీ ఆలస్యం అయింది. ఇటీవల నిర్వహించిన టెట్ పరీక్ష ప్రశ్నాపత్రం కష్టంగా వచ్చినా 150 మార్కులతో సత్తా చాటింది. తెలంగాణ డీఎస్సీలో 13వ ర్యాంక్ సాధించింది. కౌన్సెలింగ్‌కు 1:3 ప్రకారం పిలవడంతో ఉపాధ్యాయ పోస్టు స్వల్ప తేడాతో కోల్పోయింది. గ్రూప్-2 కొలువు సాధించడమే తన లక్ష్యం అని మంజుల పేర్కొంది.



కుటుంబసభ్యులతో వడ్ల మంజుల

గ్రూప్-2 సాధించడమే లక్ష్యం

టెట్ అర్హత పరీక్షలో 150 మార్కులు సాధించడం సంతోషంగా ఉంది. డీఎస్సీలో పాసై టీచర్ అయినా గ్రూప్-2 సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. అందుకోసం ప్రయత్నం చేస్తున్నాను. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ చదివిస్తున్నారు. వారి ఆశయం నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నాను. సమయాన్ని వృథా చేయకుండా చదవడం వల్లే అనుకున్నది సాధించగలిగాను.

– వడ్ల మంజుల

శభాష్ క్రాంతికుమార్

అవుకు: అవుకు మండలం నిచ్చెనమెట్లకు చెందిన తలారి కృష్ణయ్య, భూలక్ష్మి దంపతుల కుమారుడు క్రాంతికుమార్ టెట్ ఫలితాల్లో 150 మార్కులు సాధించాడు. తల్లిదండ్రులకు మూడెకరాల పొలం ఉంది. ఉన్నంతలో పిల్లలను చదివిస్తున్నారు. పెద్ద కుమారుడు గ్రామ సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు క్రాంతికుమార్ ప్రాథమిక విద్య నిచ్చెనమెట్లలో పూర్తి చేశాడు. పదో తరగతి వరకు గుండ్లశింగవరం ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్మీడియెట్ నలంద కాలేజీలో చదివాడు. డిగ్రీ బనగానపల్లెలోని ఎస్వీ కళాశాలలో పూర్తి చేశాడు. టీటీసీ కూడా బనగానపల్లెలో చదువుకున్నాడు. కర్నూలులో మూడు నెలల పాటు కోచింగ్ తీసుకున్నాడు. 2018 డీఎస్సీలో 71.65 మార్కులు సాధించాడు. సోమవారం విడుదలైన టెట్ ఫలితాల్లో 150 మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. ఎలాగైనా డీఎస్సీలో ప్రతిభ చాటి ఉపాధ్యాయ వృత్తిలో చేరాలని లక్ష్యం పెట్టుకున్నాడు.



కుటుంబసభ్యులతో క్రాంతికుమార్ (కుడివైపు వ్యక్తి)

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ ధర్నా
- కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నం – అడ్డుకున్న పోలీసులు

కర్నూలు(సెంట్రల్): విద్యారంగ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ విమర్శించారు. పెండింగ్ బకాయిల కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రూ.3408 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజులు కట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయన్నారు. దీంతో అప్పులు చేసి పిల్లలను చదివించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, అయినా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించడం లేదని, అమెరికా పర్యటనలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేస్తామన్న హామీని పట్టించుకోవడం లేదన్నారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలను పెంచాలని, ఒక్కో విద్యార్థికి నెలకు రూ.3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తుగ్గలి, దేవనకొండ మండల కేంద్రాల్లో ఏపీ మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని, తల్లికి వందనం కింద పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు రూ.15 వేలు వెంటనే ఇవ్వాలని, కేవీఆర్ జూనియర్ కళాశాలకు సొంత భవనం కేటాయించాలని, హాస్టల్‌లో నాణ్యమైన ఆహారం అందించాలని, జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపకపోతే పోరాటాలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు విద్యార్థి సంఘం నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన ఎస్ఎఫ్ఐ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రభుత్వాల తీరుతో విద్యారంగం సంక్షోభం

- ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి
- పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామకృష్ణ పిలుపు

నంద్యాల(న్యూటౌన్): కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతున్నాయని, వారు అనుసరిస్తున్న ప్రజా, విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామకృష్ణ, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, జాతీయ నాయకులు గనిరాజు పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ సెంటినరీ హాల్‌లో రాష్ట్రసభను నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ అధ్యక్షత వహించారు. ముందుగా 50 వసంతాల జెండాను ఆవిష్కరించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థి హక్కుల సాధన కోసం అమరవీరుల వారి స్ఫూర్తితో శాస్త్రీయ విద్యాసాధన కోసం ఉద్యమించాలన్నారు. అనంతరం హృదయరాజు, గనిరాజు, కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అవలంభిస్తోందని, దేశ సంపదను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టం హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ.3,800 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.



నంద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

విద్యార్థుల భారీ ప్రదర్శన

పీడీఎస్‌యూ 50 వసంతాల మేఘ గర్జన రాష్ట్ర సభ ప్రారంభానికి ముందు పద్మావతినగర్ సెంటర్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా మున్సిపల్, సెంటినరీ హాల్ వరకు విద్యార్థులు ఎర్రజెండాలు చేతబట్టి ప్రదర్శన నిర్వహించారు. శాస్త్రీయ విద్యాసాధన, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామంటూ నినాదాలు చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దు, రాష్ట్ర ఉపాధ్యక్షులు భానుప్రసాద్, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమశంకర్, ఏపీటీఎఫ్ కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు సత్యన్న, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రెండు గుడిసెలు దగ్ధం

- రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

మహానంది: గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగించే నిరుపేదలైన తండ్రీకుమారుల కుటుంబాలపై అగ్నిదేవుడు కన్నెర్ర చేయడంతో రెండు గుడిసెలు దగ్ధం కాగా ఇంటిల్లిపాది కట్టుబట్టలతో మిగిలారు. ఈ సంఘటన మంగళవారం గాజులపల్లెలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన నక్కా సుబ్బడు, నక్కా లింగమయ్య గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం కుటుంబ సభ్యులందరూ గొర్రెలను మేపేందుకు వెళ్లగా సుబ్బడు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడి గుడిసెకు నిప్పంటుకుంది. ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలడంతో పక్కనేఉన్న లింగమయ్యకు చెందిన గుడిసెకు మంటలు వ్యాపించాయి. మంటలు చెలరేగి మరో సిలిండర్ పేలడంతో చుట్టుపక్కల వారు సైతం భయభ్రాంతులకు గురయ్యారు. అగ్ని ప్రమాదంలో రెండు గుడిసెలు పూర్తిగా కాలిబూడిద కావడంతో కుటుంబసభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. ఇల్లు నిర్మించుకునేందుకు ఇటీవలే తెచ్చిపెట్టుకున్న రూ.1.50 లక్షల నగదుతో పాటు రెండు తులాల బంగారు వస్తువులు కాలిపోగా 8 గొర్రెపిల్లలు మృత్యువాత పడ్డాయి. రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న నంద్యాల అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బాధితుల పరిస్థితిని చూసి జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి యోగేశ్వర్‌రెడ్డి తన వంతు ఆర్థిక సహాయం అందించారు. ఆర్ఐ వెంకట సుబ్బారావు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.



మంటల్లో పూర్తిగా దగ్ధమైన గుడిసె

ఓవర్‌హెడ్ ట్యాంకు ఎక్కి వీరంగం

కౌతాళం: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఓ వ్యక్తి వాటర్‌ట్యాంక్ ఎక్కి వీరంగం సృష్టించాడు. గ్రామానికి తాగునీరు అందించే ఓవర్‌హెడ్ ట్యాంకు ఎక్కి, రోడ్డుపై వెళుతున్న జనాలను బూతులు తిడుతూ, ఇటీవల మృతి చెందిన కుమార్తె ఫొటోను చూపిస్తూ రెండు గంటల పాటు టెన్షన్ పుట్టించాడు. వివరాలు.. కౌతాళంకు చెందిన దావీదుకు భార్య జ్యోతి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బతుకుదెరువుకు గుంటూరుకు వెళ్లిన ఈ కుటుంబం అక్కడ పనులు చేసుకుంటూ కాలం వెళ్లదీశారు. ఈ క్రమంలో గత నెల రెండవ కుమార్తె లేఖనా (15) థైరాయిడ్, కిడ్నీల సమస్యతో మృతి చెందింది. ఆ తర్వాత దావీదు మరింతగా తాగుడుకు బానిసై కుమార్తె ఫొటో పట్టుకుని.. తాను చనిపోతానని కుటుంబసభ్యుల్ని బెదిరిస్తూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మద్యం మత్తులో కుమార్తె ఫొటో పట్టుకుని వాటర్ ట్యాంకు ఎక్కి దూకేస్తానంటూ వీరంగం సృష్టించాడు. సీఐ అశోక్‌కుమార్ అక్కడకు చేరుకుని దావీదు భార్య జ్యోతి, కుటుంబసభ్యులతో మాట్లాడగా.. గతంలో బెంగళూరుకు వలస వెళ్లినప్పుడు ఇలాగే ట్యాంకు ఎక్కడంతో అక్కడివారు నచ్చజెప్పి కిందకు దింపారని చెప్పారు. చివరకు కొందరు యువకులు చాకచక్యంగా ట్యాంకు ఎక్కగా, మరికొందరు కింద వలను రెడీగా పట్టుకున్నారు. పైన ఎక్కిన వారు దావీదును పట్టుకుని జాగ్రత్తగా కిందకు దింపడంతో పోలీసులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.



కుమార్తె ఫొటోతో ట్యాంకు పైకి ఎక్కిన దావీదు

కోనేరులో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటేష్‌నాయక్

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలోని బ్రహ్మగుండం క్షేత్రం కోనేటిలో పడి వెంకటేష్‌నాయక్ (38) అనే వ్యక్తి చెందాడు. వివరాలు.. కల్లూరు మండలం, కొల్లంపల్లితండా గ్రామానికి చెందిన వెంకటేష్‌నాయక్ శివదీక్ష చేపట్టేందుకు మంగళవారం బ్రహ్మగుండం వచ్చారు. స్నానం చేసేందుకు ఆలయ కోనేటిలో దిగాడు. ప్రమాదవశాత్తు జారి నీటిలో మునిగిపోతున్న ఈయన్ను అక్కడ ఈత కొడుతున్న యువకులు పైకి తీసుకొచ్చారు. అప్పటికే వెంకటేష్ నాయక్ మృతి చెందాడు. ఘటనపై వెల్దుర్తి పోలీసులు విచారణ చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై హత్యాయత్నం

- ఆటోలో వచ్చి బైక్‌ను ఢీకొట్టిన టీడీపీ దుండగులు
- ముసుగులు వేసుకొని కర్రలతో మూక దాడి

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ 23వ వార్డు కార్పొరేటర్ ఇంటిపై దాడి చేసి అడ్డొచ్చిన వారిని చావబాది 24 గంటలు దాటకముందే మరోసారి టీడీపీ మూకలు రెచ్చిపోయారు. సోమవారం కార్పొరేటర్ ఇంటిపై దాడి చేసిన ఘటనలో పోలీసులు ఏ మాత్రం స్పందించకపోవడంతో రెచ్చిపోయిన టీడీపీ మూకలు ఇద్దరు వైఎస్సార్‌సీపీ నాయకులపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు.. మద్దూరు నగర్‌కు చెందిన మైనార్టీ నాయకులు ముస్తఫా, అతని బంధువు 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్‌గా పనిచేసిన ఆయనకు వార్డుతో పాటు పలు కాలనీలలో మంచి పరిచయాలు ఉన్నాయి. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీకి చెందిన కొందరు దుండగులు మంగళవారం రాత్రి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. స్థానిక రామచంద్రమిషన్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంపై ముస్తఫా, బంధువు కలిసి వస్తుండడాన్ని గమనించిన దుండగులు ఆటోలో వచ్చి ఢీకొట్టారు. కిందపడిన వారిని ముఖాలకు ముసుగులు ధరించి ఆటోనుంచి దిగిన ఐదుగురు దుండగులు కర్రలతో చావబాదారు. స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేసినా దుండగులు వీరంగం సృష్టించి తీవ్రంగా కొట్టారు. వీపు, కాళ్లు, చేతులపై కర్రలతో చితకబాదడంతో ముస్తాఫాకు ఒక చెయ్యి విరిగింది. దాడికి పాల్పడిన దుండగులు అక్కడినుంచి పరారయ్యారు. దాడిలో స్పృహ కోల్పోయిన వీరిని స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. భయాందోళనకు గురైన కుటుంబసభ్యులు ఏవరితో మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి కూటమి నేతలు, టీడీపీ గుండాలు వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసుకొని దాడులకు పాల్పడుతున్నా పోలీసు శాఖ మాత్రం ఏమాత్రం స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ముస్తఫా